

డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాల్సిందేనని, ప్రభుత్వం తన మొండివైఖరిని విడనాడాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తుంగ బాలు మాట్లాడారు. తెలంగాణలో డీఎస్సీని వాయిదా వేయాలని రెండునెలలుగా నిరుద్యోగులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటవెంటనే పరీక్షలు ఉండటంతో డీఎస్సీ అభ్యర్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు.





ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద విద్యార్థులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

# తాడోపేడో తేల్చుకుంటం

మొదటిపేజీ తరువాయి...

వందలాది మంది నిరుద్యోగులు అక్కడి నుంచి ఉద్యమ కొనసాగింపును ప్రకటించారు. డీఎస్సీని వాయిదా వేసేవరకూ ఆందోళనను విరమించేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. ఈ సమయంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్ క్యాంటీన్‌లో రాత్రి పోలీసులు క్యాంటీన్‌ను మూయించి, లైట్లు బంద్ చేసి, నీళ్లు, తిండి లేకుండా దమననీతిని పాటించారు. దీంతో పోలీసుల వేధింపులతో వందలాది మంది డీఎస్సీ అభ్యర్థులు.. కాలినడకన బయలుదేరి సుమారు 10 కిలోమీటర్ల దూరమున్న ఓయూ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడే ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. నిద్రాహారాలు మాని మంగళవారం కూడా నిరసనను కొనసాగించారు. ఇలాంటి పరిస్థితిలో పోలీసుల కర్కశత్వం కలచివేసింది. డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలని, మెగా డీఎస్సీ ప్రకటించాలనే న్యాయమైన డిమాండ్లు చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులపై భారీ పోలీసు బలగాలు విరుచుకుపడ్డాయి. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలో పురుషులు, మహిళలు అని తేడా లేకుండా వెంటాడి తరుముతూ పట్టుకొని నిర్దాక్షిణ్యంగా ఎత్తుకెళ్లి పోలీస్ వాహనంలో ఎత్తిపడేశారు. మేం ఉగ్రవాదులం కాదు.. నిరుద్యోగులం అంటూ వేడుకున్నా ఆ పోలీసుల కఠినత్వం కరగలేదు. పదేండ్లపాటు పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు మాత్రమే కనిపించిన ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం ఉదయం కనిపించిన ఈ దృశ్యాలు ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ఘట్టాలను గుర్తు చేశాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు డీఎస్సీ అభ్యర్థులు తిండీ తిప్పలు లేక, కనీసం తాగేందుకు మంచినీళ్లు కూడా దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మహిళా నిరుద్యోగులు సైతం రోజంతా నిరసన చేయడంతోపాటు అర్ధరాత్రి పదుల కిలోమీటర్లు నడిచి, ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకోవడం.. ఆపై మళ్లీ పోలీసులు అరెస్టు చేయడంతో యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.

### తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు

డీఎస్సీ అభ్యర్థులు రాత్రంతా క్యాంపస్‌లోనే తమ ఆందోళన కొనసాగించారు. మంగళవారం ఉదయం వందలాది మంది పోలీసులు క్యాంపస్‌లో మోహరించారు. ఓయూలోని ల్యాండ్ స్కేప్ గార్డెన్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో అభ్యర్థులు వారిని తప్పించుకునేందుకు ప్రయత్నించగా, వారిని వెంటాడి మరీ పట్టుకొని అరెస్టు చేశారు. ఈ క్రమంలో క్యాంపస్‌లోని అనేక ప్రాంతాల్లో పరుగులు పెడుతున్న నిరుద్యోగులు, వెంటాడుతున్న పోలీసులు.. ఇవే దృశ్యాలు కనిపించాయి. దీంతో తెలంగాణ ఉద్యమ సమయంలో ఆనాటి పాలకులు దమననీతి కండ్లముందు కదలాడిందని విద్యార్థులు, నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులు కూడా ఇదే విషయాన్ని గుర్తు చేశారు.



బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో ఉస్మానియా విద్యార్థి నేతలను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు



ఉస్మానియా యూనివర్సిటీ మళ్లీ ఉద్యమకాలాన్ని తలపిస్తున్నది.
నిరుద్యోగుల నిరసనలను అడ్డుకోవడానికి మంగళవారం ఓయూలో భారీగా మోహరించిన పోలీసులు

# సీఎంగా మోకా వస్తే ధోకా చేస్తరా?

- మెగా డీఎస్సీ ఏమైంది రేవంత్‌రెడ్డీ?
- ఓయూలో మళ్లీ ఉద్యమం నాటి పరిస్థితులు: కేటీఆర్
- డీఎస్సీ అభ్యర్థుల అరెస్టులు, నిర్బంధంపై ఆగ్రహం
- బీఆర్ఎస్ జెండా అండగా ఉంటుందని భరోసా



హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి క్యాబినెట్‌లోనే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామన్న హామీ ఏమైందని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా మీకు మోకా వస్తే.. డీఎస్సీ అభ్యర్థులకు ఇంత ధోకా చేస్తారని ఊహించలేదని చెప్పారు. మెగా డీఎస్సీ అని తీరా అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. డీఎస్సీ వాయిదా వేయాలని, పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై అక్రమ కేసులు, నిర్బంధం, అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. లక్షలాది మంది డీఎస్సీ అభ్యర్థుల ఆక్రందన కాంగ్రెస్ సర్కారుకు వినపడటం లేదా? అని నిలదీశారు. గతంలో ఉస్మానియా విద్యార్థులు అడ్డమీద కూలీల్లాంటి వారని, తిన్నది అరిగేదాకా అరిచే బీరు, బిర్యానీ బ్యాచ్ అని ఇదే సీఎం రేవంత్‌రెడ్డి బద్నాం చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. సిద్ధాంతం, ఆలోచన లేని ఆవారా టీమ్ అని వారి అవహేళన చేసిన మీరు.. అదే విద్యార్థులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చారన్న సంగతి మర్చిపోవద్దని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే నేడు అదే ఉస్మానియా యూనివర్సిటీని రణరంగంగా మార్చి.. డీఎస్సీ అభ్యర్థులపై పోలీసులను ప్రయోగించి అణచివేస్తున్నారని మండిపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం దేశ సరిహద్దుల్లో ఉన్నదా? అక్కడికి అన్ని బలగాలను తెచ్చి ఎందుకంతా నిర్బంధాన్ని విధిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. మళ్లీ ఉస్మానియాలో ఉద్యమం నాటి పరిస్థితులను రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకొస్తున్నదని మండిపడ్డారు.

### అభ్యర్థుల భవిష్యత్తుతో చెలగాటం

డీఎస్సీ ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వకుండా అభ్యర్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటం న్యాయమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. పరీక్షల వాయిదా కోరుతుంటే, ప్రభుత్వం ఎందుకు మొండివైఖరి ప్రదర్శిస్తున్నదని నిలదీశారు. డిమాండ్లను ఆడబిడ్డలు అడిగినంత మాత్రాన అర్ధరాత్రి వరకు అక్రమంగా నిర్బంధిస్తారా? అని ప్రశ్నించారు.

### సోకాల్డ్ మేధావులెక్కడ?

ఇన్నాళ్లు కాంగ్రెస్ సర్కార్‌ను భుజాన మోసిన సోకాల్డ్ మేధావులు ఇప్పుడు ఎక్కడున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులు నేడు ఎందుకు మూగబోయాయో చెప్పాలని నిలదీశారు. ఇప్పటికైనా డీఎస్సీ వాయిదా, పోస్టుల పెంపు డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ జెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తే నిరుద్యోగులతో కలిసి మరో ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే అణచివేతకు పాల్పడుతున్న సర్కార్‌పై నిరుద్యోగ యువత భగ్గు మంటున్నదని బీఆర్ఎస్ పార్టీ ట్వీట్‌ను కేటీఆర్ రీట్వీట్ చేశారు.

## క్షీణించిన అశోక్ ఆరోగ్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేస్తున్న అశోక అకాడమీ డైరెక్టర్ పాలకూరి అశోక్ ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. పోలీసుల నిర్బంధంతో గత 8 రోజులుగా దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని ఆయన ఇంట్లోనే దీక్ష చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగా క్షీణిస్తుందని, పల్స్ రేటు పడిపోతుండగా, షుగర్ లెవల్స్ సైతం పడిపోయాయి. బీపీ కూడా పెరిగింది. తనను ఎవరితోనూ మాట్లాడనివ్వడం లేదని అశోక్ తెలిపారు.



## కొనసాగుతున్న బక్క జడ్సన్ దీక్ష

నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆయన నివాసంలోనే కొనసాగుతున్నది. దీక్ష చేస్తున్న బక్క జడ్సన్‌ను బీఆర్ఎస్ నాయకులతో పాటు పలువురు నిరుద్యోగులు మంగళవారం పరామర్శించారు.

## దిల్‌సుఖ్‌నగర్‌లో మరో విద్యార్థి ఆమరణ దీక్ష



డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ గోపి అనే విద్యార్థి ఆయన దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటున్న హాస్టల్‌లోనే మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తమ న్యాయపరమైన డిమాండ్లపై ప్రభుత్వం ఎలాంటి సమీక్ష చేయకుండా, షెడ్యూల్ ప్రకారమే పరీక్ష నిర్ణయిస్తామనడం సరికాదని చెప్పారు. డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులమంతా నగరంలో మహాధర్నా చేపట్టామని, దీన్ని పోలీసులు అడ్డుకోగా, ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడమే లేదని ధ్వజమెత్తారు.

## నిరుద్యోగుల తిరుగుబాటు తప్పదు

- ఉద్యమాన్ని అణచే యత్నం
- మహిళలపైనా అమానుషం
- బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి



హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే తిరుగుబాటు మరింత తీవ్రమవుతుందని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి హెచ్చరించారు. లాఠీలు చూపెట్టి.. తుపాకీలు ఎక్కుపెట్టి.. ముళ్ల కంచెలు, బారికేడ్లను అడ్డుపెట్టి పోలీసులతో అణచేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలనే నిరుద్యోగులు అడుగుతున్నారని చెప్పారు. నిరుద్యోగులకు సంఘీభావంగా మంగళవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమైక్య పాలనలో కారు చీకట్లో సమైక్య ఉద్యమకారులను బంధించినట్లు.. ఈరోజు కూడా కారు చీకట్లో నిరుద్యోగులను బంధించడం అమానుషమని రాకేశ్‌రెడ్డి విమర్శించారు. సమైక్య పాలనలో రేవంత్ గురువైన చంద్రబాబునాయుడు ఆరోజు బషీర్‌బాగ్‌లో రైతుల రక్తాన్ని కండ్లచూశారని, ప్రాణాలను పొట్టన పెట్టుకున్నాడని ధ్వజమెత్తారు. ఈరోజు ఆయన శిష్యుడైన రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల రక్తాన్ని కండ్ల చూస్తున్నాడని విమర్శించారు.

## షెడ్యూల్ ప్రకారమే గ్రూప్ 2?

- నిరుగ్యోగులను గందరగోళంలో పడేస్తున్న సర్కారు
- పోస్టుల పెంపు.. వాయిదా లేదని సంకేతాలు
- ఏర్పాట్లు చేయాలని టీజీపీఎస్సీ అధికారుల ఆదేశాలు!

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరుద్యోగులు ఆశపడుతున్నట్టుగా గ్రూప్ 2లో ఒక్క పోస్టు పెంచే ప్రసక్తే కనిపించడం లేదు. కనీసం అలాంటి ఆలోచన కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నట్టు లేదని తెలుస్తున్నది. ఈ విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి కొంతవరకు స్పష్టత ఇచ్చారు. నిరుద్యోగులు కోరుతున్నట్టు పరీక్షలు వాయిదా వేసే ఆలోచనా చేయడం లేదని తెలుస్తున్నది. షెడ్యూల్ ప్రకారమే ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించడానికి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలను గతంలోనే గుర్తించగా, పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఇప్పటికే జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రశ్నపత్రాలతోపాటు పరీక్షలకు నిర్వహణకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేస్తున్నట్టు టీజీపీఎస్సీ వర్గాల ద్వారా తెలుస్తున్నది. గ్రూప్ 2లో 2,000 పోస్టుల సంఖ్యను పెంచుతామని గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ఆ పార్టీ తుంగలో తొక్కిందని నిరుద్యోగులు ఆందోళనకు దిగుతున్నారు.

# కోచింగ్ సెంటర్ల కుట్ర ఇది

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడారు. పరీక్షలు వాయిదా పడటం వల్ల లాభమే తప్ప ప్రభుత్వానికి పోయేదేమీ ఉండదని, అభ్యర్థులకే నష్టమని అన్నారు. కోచింగ్ సెంటర్ల వారు పరీక్షలు వాయిదా వేయాలని తన వద్దకు పైరవీలు చేస్తున్నారని తెలిపారు. పరీక్షలు వాయిదా వేయించేందుకే కిరాయి మనుషులను పెట్టి ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి తలమాసినోడు వచ్చి డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. నిరుద్యోగులకు న్యాయం చేసేందుకే పరీక్షలు వాయిదా వేదం లేదని స్పష్టం చేశారు. నిరుద్యోగుల బలహీనతను వ్యాపారంగా మలచుకోవాలనే ఉద్దేశంతోనే ఉద్యమాలు చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులను రెచ్చగొట్టి నిరుద్యోగి మోతీలాల్‌తో ధర్నా చేయించారని ఆరోపించారు. నిరాహారదీక్షల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన అభ్యర్థులను కూర్చోబెట్టకుండా కేటీఆర్, హరీశ్‌రావు ఆమరణదీక్ష చేయాలని సవాల్ చేశారు. 'పరీక్షలు వాయిదా అన్నా పడలి.. లేదా మా ప్రాణాలైనా పోవాలి' అన్న నినాదంతో వారిద్దరూ ఆర్ట్స్ కాలేజీ ముందు దీక్షకు కూర్చుంటే రక్షణ కల్పిస్తామని చెప్పారు. విద్యార్థుల మరణాలతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. గ్రూప్-1 మెయిన్‌కు 1:100 నిష్పత్తిలో పిలిస్తే మళ్లీ కోర్టుకు వెళ్తారని, అప్పుడు కోర్టు నోటిఫికేషన్‌లో లేకుండా 1:100 నిష్పత్తిలో ఎలా పిలుస్తారని పరీక్షను రద్దు చేస్తుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ వచ్చిన 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. నిరుద్యోగ యువకులు సంయమనం పాటించాలని కోరారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏఎస్ఎన్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, వేదికపై మంత్రి జూపల్లి తదితరులు

### కార్యకర్తలకు గుర్తింపునిస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన కార్యకర్తలకే వచ్చే ఎన్నికల్లో నిలబడేందుకు అవకాశం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. తాను నాయకులకు నాయకుడిని కాదని, కార్యకర్తల్లో ఓ కార్యకర్తనని చెప్పారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించబోతున్నామని, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా, ఎంపీపీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అంతా అయిపోయినట్టు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### సీఎం ప్రసంగిస్తుండగా కరెంట్ కట్

*పాలమూరులో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా 10 నిమిషాల తర్వాత 6:42 గంటల సమయంలో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఫ్యాన్‌లు, లైట్లు ఆఫ్ అయ్యాయి. ఫంక్షన్‌హాల్‌లో ఉన్న జనరేటర్ సహాయంతో కార్యక్రమం కొనసాగింది. సీఎం వెళ్లిపోయాక విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఎక్కడా నిమిషం కూడా కరెంట్ పోవడం లేదని సీఎం చెప్పారు.. కానీ ఆయన ప్రసంగంలోనే కరెంట్ పోయింది.*

## సీఎం వ్యాఖ్యలు దౌర్భాగ్యకరం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి నిరుద్యోగులపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దౌర్భాగ్యకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మహబూబ్‌నగర్ పర్యటనలో సీఎం వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ ఉద్యోగాల నియామక పరీక్షల వాయిదాపై సీఎం పరిణతి లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాటనా అంటూ సీఎంని ప్రశ్నించారు. రెండు నాల్కల ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని, బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## జేఎల్ ఫైనల్ 'కీ'లో తప్పులు

- హైకోర్టులో కేసు నమోదు

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి పరీక్షల తుది కీలో తప్పులు ఉన్నాయని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. కెమిస్ట్రీలో 20 ప్రశ్నలకుపైగా తప్పులు వచ్చాయని వాపోయారు. జేఎల్ ప్రశ్నాపత్రం రూపకల్పనలో టీజీపీఎస్సీ చేసిన తప్పులతో తన ఉద్యోగం పోయిందని నిరుద్యోగి ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై హైకోర్టులో కేసు దాఖలు చేసినట్టు వెల్లడించారు.

# ఒక్క నోటిఫికేషన్.. ఎన్నో అనుమానాలు!

- గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్ లోపాల పుట్ట
- జీవో-55కు సవరణలె ఎందుకు?
- షార్ట్‌ఫాల్ విధానం మర్మమేమిటి?
- అదనంగా పెరిగిన అభ్యర్థులు ఎవరు?
- 2 రోజుల్లోనే 1.33లక్షల దరఖాస్తులా?
- నిరుద్యోగుల అనుమానాలు
- న్యాయపోరాటం తప్పదని హెచ్చరిక

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 563 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న విడుదలైన కొత్త గ్రూప్-1 నోటిఫికేషన్‌పై అనుమానాలున్నాయని తెలంగాణ నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వాటిని ప్రభుత్వం,టీజీపీఎస్సీ నివృత్తి చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే న్యాయ పోరాటాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

### పాత నోటిఫికేషన్ రద్దు ఎందుకు ?

గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి 2022లో 503 పోస్టులతో నోటిఫికేషన్ విడుదలైంది. ప్రశ్నపత్రాలు లీకైన నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు మళ్లీ నిర్వహించాలని హైకోర్టు తీర్పు చెప్పింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం పాత గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్తగా 60 పోస్టులు కలిపి 563 పోస్టులతో ఫిబ్రవరి 19 కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. పాత నోటిఫికేషన్‌లోనే పోస్టులు కలుపుతూ సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇస్తే సరిపోయేది కదా! అని నిరుద్యోగులు సందేహం వ్యక్తంచేస్తున్నారు.

### జీవో 55ని ఎందుకు మార్చారు?

గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ కోసం జీఏడీ సర్వీసెస్-ఏ విడుదల చేసిన జీవో 55ని ఎందుకు రద్దు చేశారని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఈ జీవోలో పేర్కొన్నట్టుగా గ్రూప్-1 నోటిఫికేషన్‌లో కమ్యూనిటీవారీగా కేటాయించిన పోస్టుల వారీగా 1:50 నిష్పత్తిని పాటిస్తూ మెయిన్ పరీక్షలకు ఎంపిక చేయాల్సి ఉన్నది. దీనివల్ల జనరల్ క్యాటగిరీ అభ్యర్థులతోపాటు రిజర్వేషన్లకు చెందిన అభ్యర్థులకు ఎలాంటి అభ్యంతరాలు ఉండవు. కానీ జీవో-55 స్థానంలో జీవో-29 తీసుకొచ్చారు. జీవో-29 ప్రకారం గ్రూప్-1లో ఉన్న మొత్తం పోస్టులను కలిపి 1:50 ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేశారు. యూపీఎస్సీలో ప్రిలిమినరీ పరీక్షలో కమ్యూనిటీ పోస్టుల వారీగా అభ్యర్థులను మెయిన్‌కు ఎంపిక చేస్తారు. అలాంటిది ఈ నోటిఫికేషన్ ద్వారా ఎందుకు ఎంపిక చేయలేదు? అని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

### గ్రూప్-1 మెయిన్ కోసం 1:100 ఎందుకు అమలు చేయరు?

*కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే గ్రూప్-1 మెయిన్ కోసం 1:100 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేస్తుందని ఆశ పడ్డామని, ఇప్పుడు నిరాశే మిగిలిందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో మాట్లాడుతూ.. 1:100 నిష్పత్తి పాటించి తీరాల్సిందే అని డిమాండ్ చేశారని గుర్తుచేస్తున్నారు. 1:100 నిష్పత్తి పాటించక పోవడంలో ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఫలితాల విడుదల్లో పారదర్శకత లోపించిందని, దీనిని నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ నిరుద్యోగ యువత స్పష్టం చేస్తున్నది.*

### 'షార్ట్‌ఫాల్' విధానం ఎందుకు?

గ్రూప్-1 నోటిఫికేషన్‌లో చేసిన మార్పుల ప్రకారం మెయిన్ పరీక్షలకు అభ్యర్థులను ఎంపికలో కొత్తగా 'షార్ట్‌ఫాల్' విధానం అమలుచేశారు. రిజర్వేషన్ల వారీగా కాకుండా మెరిట్ విధానాన్ని పాటించారు. 563 పోస్టుల కోసం 28,150 మందిని తొలుత ఎంపిక చేశారు. ఆ జాబితాలో కమ్యూనిటీకి చెందిన అభ్యర్థులు 1:50 నిష్పత్తిలో కాకుండా తక్కువమంది వచ్చారు. ఈ తక్కువ బడిన రిజర్వేషన్ అభ్యర్థులను 'షార్ట్‌ఫాల్' విధానంలో, ఆ తర్వాత ఉన్న మెరిట్‌తో అదే కమ్యూనిటీకి చెందిన అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇలా చేయడం వల్ల అదనంగా 3,232 మంది అభ్యర్థులు అంటే 1:57 నిష్పత్తి పాటించినట్టు అయింది. ఈ షార్ట్‌ఫాల్ విధానం వల్ల పెరిగిన 3,232 అభ్యర్థులు ఏ కమ్యూనిటీకి చెందినవారు? దీనివల్ల ఎవరికి లాభం జరిగిందో, ఎవరికి నష్టం జరిగిందో వెల్లడించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

### రెండు రోజుల్లో లక్షల దరఖాస్తులా..?

గ్రూప్-1 దరఖాస్తుకు మార్చి 14 వరకు గడువు విధించారు. ఆ గడువు నాటికి 2.70 లక్షల మంది దరఖాస్తులు చేశారు. మార్చి 16 వరకు గడువు పొడిగిస్తే..రెండు రోజుల్లోనే అదనంగా 1.33 లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఏం జరిగిందనే అనుమానాలను నిరుద్యోగులు వ్యక్తంచేస్తున్నారు.

### పాత నోటిఫికేషన్‌లో పాస్.. కొత్త నోటిఫికేషన్‌లో ఫెయిల్!

పాత గ్రూప్-1 నోటిఫికేషన్ ప్రకారం రెండుసార్లు నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు.. కొత్తగా గ్రూప్-1 ప్రకారం నిర్వహించిన పరీక్షలో ఎందుకు అర్హత సాధించలేక పోయారు? అనే సందేహాన్ని నిరుద్యోగులు వ్యక్తంచేస్తున్నారు. లక్షల వెచ్చించి తీసుకున్న కోచింగ్‌లు వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత నోటిఫికేషన్‌లో బాగా చదివినవారు కొత్త నోటిఫికేషన్‌లో చదువలేక పోయారా? లేక ఫలితాలు విడుదలలో ఏమైనా గందరగోళం జరిగిందా? అని ప్రశ్నిస్తున్నారు.